క్లుప్తంగా

నేడు మార్కెట్‌కు సెలవు

కేసముద్రం: మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తం రెడ్డి మృతికి సంతాప సూచకంగా వ్యాపారస్తుల కోరిక మేరకు నేడు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ సుహాసిని సోమవారం తెలిపారు.

8నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

గూడూరు: మండల కేంద్రంలోని గొల్లగూడెంలో ఈనెల 8వ తేదీ గురువారం ఉదయం 7.42 నిమిషములకు బీరన్న, అక్కమహంకాళి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు జరుగుతాయని కురుమగొల్ల సంఘం అధ్యక్షుడు కుండె కిషన్, ప్రధాన కార్యదర్శి కొరె పాపయ్య తెలిపారు. సోమవారం వారు మట్లాడారు. సనాతన శివాలయ ప్రధాన అర్చకుడు వలబోజు భానుప్రకాష్‌శాస్త్రి, మోత్కూరి శ్రీనివాసాచార్యుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పూజలు జరుగుతాయని, గొల్లకురుములు కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

గంగమ్మకు బోనాలు

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురంలో నూతనంగా నిర్మించిన గంగదేవత ఆలయం వద్ద సోమవారం యాదవులు ఘనంగా బోనాలు చెల్లించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బిందుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, యాదవ కులస్తులు పూజలు నిర్వహించారు.

గంగాదేవికి పూజలు

గూడూరు: మండలంలోని కొల్లాపురం శివారు గంగదేవితండా సమీపంలోని గుట్ట వద్ద తండా వాసులు, కొల్లాపురం గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. కార్యమంలో సర్పంచ్‌లు సుధాకర్ రావు, సర్పంచ్ ముక్కా లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ గుర్రం కవితవెంకన్న పాల్గొన్నారు.

'వృత్తి నైపుణ్యంతో ఉపాధికి బాటలు'

పెద్దవంగర: వృత్తి నైపుణ్యంతో ఉపాధికి బాటలు పడతాయని ఎంపీపీ రాజేశ్వరి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు చిట్యాల గ్రామంలో రైతువేదికల్లో సెర్ప్, శ్రీనిధి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ తరగతుల్లో మొదటి, రెండో విడతలో శిక్షణ పొందిన 100మంది మహిళలకు ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా పంపిణీ చేసిన చీరలను వారికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జ్యోతిర్మయి, ఎంపీఓ నరేందర్, ఎంపీటీసీ శ్రీనివాస్, సీసీలు సుధాకర్, సుజాత, వార్డు మెంబర్ రజిత, మహిళలు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: లేబర్ ఇన్సూరెన్స్ క్లైయిమ్ ఇప్పిస్తానని ఓ మహిళ మోసం చేయగా బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు సదరు మహిళపై చీటింగ్ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ టౌన్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన ఐనాల రాములమ్మ భర్త వెంకటయ్య మృతిచెందాడు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోడతండాకు చెందిన గుగులోతు దేవి ఇన్సూరెన్స్ క్లైయిమ్ చేయిస్తానని రాములమ్మ ఇంటికి వెళ్లింది. ఆధార్, రేషన్ కార్డు, ఏపీజీవీ బ్యాంకు ఖాతా పుస్తకం, పాస్ ఫొటోలు తీసుకుంది. ఈక్రమంలో రాములమ్మ రెండేళ్లుగా దేవిని ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అడుగుతుంది. కొంతకాలం తరువాత ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చాయని చెప్పింది. ఏపీజీవీబీ బ్యాంకుకు వెళ్లి చూడగా వారికి డబ్బులు రాలేదు. తొర్రూరు లేబర్ ఆఫీస్ నందు అడగగా హైదరాబాద్ హెడ్ ఆఫీస్ వెళ్లమన్నారు. అక్కడ అడగగా మహబూబాబాద్‌లోని భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఆమె పేరు మీద డబ్బులు జమ అవ్వడంతోపాటు విత్‌డ్రా అయినట్లు బ్యాంక్ అధికారులు చెప్పారు. దేవిని అడగగా డబ్బులు డ్రా చేయలేదు అన్నది. వారు ఇచ్చిన ఏపీజీవీబీ బ్యాంకు ఖాతా కాకుండా భద్రాద్రి బ్యాంకులో బాధితులు లేకుండా అకౌంట్ తెరిచి బ్యాంక్ అకౌంట్ బుక్ కూడా వారికి ఇవ్వలేదు. రాములమ్మ ప్రమేయం లేకుండా రూ.1.30 లక్షలు నగదు డ్రా చేసింది. దీంతో తాము మోసపోయామని గ్రహించి బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మదర్ థెరిసా సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్, టీపీఓ నవీన్, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు మాట్లాడారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు బి.వెంకటేశ్వర్లు, రమా రత్నమాల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మమత, డాక్టర్ టి.యుగంధర్, వేణుగోపాల్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు.

సేంద్రియ వ్యవసాయం మేలు

మహబూబాబాద్ రూరల్: సేంద్రియ వ్యవసాయం చేయడం వంటి పర్యావరణహిత జీవన శైలి అలవర్చుకోవాలని సాదు తండా సర్పంచ్ భూక్యా వినోద రమేష్ అన్నారు. పర్యావరణ జీవన శైలిపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోతు శాంతి, కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు సబిత, లలిత, రమ పాల్గొన్నారు. జంగిలిగొండ గ్రామంలో సర్పంచ్ సాయిలు, కార్యదర్శి మహేష్, జీపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

డోర్నకల్: పర్యావరణ పరిరక్షణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. సోమవారం మున్సిపాలిటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గూడూరు: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ అని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని కాపాడాలని సర్పంచ్ కమల శ్రీను, లోడి సాంఘిక సేవా సమితి ప్రాజెక్టు ఇంప్లిమేటర్ సురేష్ అన్నారు. మండలంలోని లైన్‌తండాలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లోడి ప్రతినిధులు కర్ర పిచ్చిరెడ్డి, మురళి, యశోద, సదర్‌లాల్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

తొర్రూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జూనియర్ సివిల్‌కోర్టు ఆవరణలో జడ్జి సరిత మొక్కలు నాటారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం పరిమళ, బార్ అసోసియేషన్ ప్రతినిధులు అశోక్, శ్రీను, రామకృష్ణ, కృపావతి పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: ప్రకృతిని కాపాడుకోవాలని వైస్ ఎంపీపీ శ్యామ్ సుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెలికట్టలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పుష్పలీల, కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్ యాకన్న పాల్గొన్నారు.

కొత్తగూడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఐకేపీ మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మల్లెల రణధీర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిలిపి వేయాలని అన్నారు. ర్యాలీలో ఎంపీడీఓ భారతి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఎంపీఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



మహబూబాబాద్: ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



మహబూబాబాద్ అర్బన్: మొక్క నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



మహబూబాబాద్ రూరల్: సాదుతండాలో..



గూడూరు: మొక్క నాటుతున్న గ్రామస్తులు



డోర్నకల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



తొర్రూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది



కొత్తగూడలో..

తహసీల్దార్‌కు వినతి

కేసముద్రం: రేషన్‌డీలర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సాంబశివుడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గొర్రె వెంకన్న, ఎండి.హుస్సేన్, రమేష్, రజిత, మహ్మద్ అలీ పాల్గొన్నారు.

డోర్నకల్: రేషన్ డీలర్ల సమ్మెలో భాగంగా కనీస గౌరవ వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ స్వాతిబిందుకు రేషన్‌డీలర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు అనిల్, గురవయ్య, హరీశ్ పాల్గొన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషన్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవ, ప్రవీణ్, ప్రసాద్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వం

కేసముద్రం: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పీసీసీ సభ్యులు గుగులోతు దస్రూనాయక్ విమర్శించారు. సోమవారం కాట్రపల్లి గ్రామంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు జాటోత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ గుగులోతు సునీత, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్ ధ్యేయం

నర్సింహులపేట: రైతులకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తూ రైతును రాజుగా చేయడమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విద్యుత్ విజయోత్సవ ర్యాలీ అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఊరి చివర నుంచి కోలాటం, డ్యాన్స్‌లతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. డీఈ విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాసరావు, ఎస్ఈ సురేష్, డీఈ మధుసూదన్, ఏడీఏ లోక్‌నాథ్‌రెడ్డి, ఏఈలు పాండు, రవి, పవన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని నర్సింహులపేట, పిచ్చిరాంతండా, బొజ్జన్నపేట, బీమ్లాతండా, కౌసల్యదేవిపల్లి, రూప్లా తండా సోమవారం వివిధ రకాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఇంకుడుగుంతలు, బాత్ రూంల బిల్లులు రాలేదని ఎమ్మెల్యేను అడిగారు. వెంటనే పరిశీలించి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టేకుల సుశీల, సర్పంచ్‌లు వేముల రజిత, పిర్నాకి రజిత, ఎర్పుల రామతార, గుగులోతు రవి, మెరుగు శంకర్, వైస్ ఎంపీపీ దేవేందర్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

అధికారుల వేధింపులు మానుకోవాలి



పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

గార్ల: ఆశవర్కర్లపై అధికారుల వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ముల్కనూరు పీహెచ్‌సీ ఎదుట ఆశవర్కర్లు ఎండను సైతం లెక్కచేయకుండా 2గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆశ వర్కర్లపై వైద్యులు, వైద్య సిబ్బంది వేధింపులు మానుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ షాజియాకు అందజేశారు. ధర్నాలో సీపీఎం, సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, సత్యం, ఉపేందర్, వీరన్న, నాగరాజు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కురవి: మండలలోని నేరడ శివారు చీమ్లాతండా జీపీలో ఎంపీపీ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే కురవి, సీరోలు మండలాలు అభివృద్ధిసాధిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య మంగీలాల్, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్దన్‌రెడ్డి, ఉపసర్పంచ్ దారవత్ వెంకన్న, నాయకులు రమేష్, చింగ్యానాయక్, బిచ్యానాయక్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రతిపల్లెలో పచ్చదనాన్ని నింపి ప్రజలు ఆరోగ్యంగా జీవించేలా చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మధనతుర్తి గ్రామంలో సోమవారం పీఎంఏవై నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ కొమ్ము అనిల్‌తో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో పరిషత్ నిధులు రూ.3లక్షలతో ఎంపీపీ వోలం చంద్రమోహన్ సీసీరోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి శోభన్, సొసైటీ చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.



నెల్లికుదురు: మధనతుర్తి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

గూడూరు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీటీసీ గుర్రం కవితవెంకన్న అన్నారు. మండలంలోని కొల్లాపురం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద సోమవారం మానుకోట మండలం కంబాలపల్లి జెడ్పీహెచ్ఎస్, కొల్లాపురం ఎంపీయూపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయ బృందం బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రాంనర్సయ్య, శ్రీధర్‌రెడ్డి, సూర్యనారాయణ, సోమేశ్వర్, ప్రభాకర్, అనిల్‌కుమార్, రేణుక, సలీమ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మరిపెడ రూరల్: బడీడు పిల్లలను బడితో చేర్పించాలని గుండెపూడి హైస్కూల్ హెచ్ఎం కుడితి ఉపేందర్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నామా, ఉపాధ్యాయులు లింగయ్య, రాజు, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ శివారు చీమ్లా తండా పరిధిలోని బంగ్యా తండాలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ర్యాలీ చేశారు. హెచ్ఎం ఎం.వెంకన్న, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ మంగీలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని మండల విద్యాధికారి పూల్‌చంద్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బొడ్రాయితండా గ్రామంలో బడిబాట నిర్వహించారు.

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు, అనుభవజ్ఞులైన టీచర్లు ఉన్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చింతల సురేష్, జీపీ కార్యదర్శి రాజు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీశైలం పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కలిగింటాయని ఎంఈఓ రాము అన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనువాస్, ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీనువాస్, సురేందర్‌గుప్తా పాల్గొన్నారు.

చైతన్యానికి విద్య అనివార్యం..

మహబూబాబాద్ రూరల్: సామాజిక, రాజకీయ, నైతిక, ఆర్థిక, సాంస్కృతిక చైతన్యానికి విద్య అనివార్యమని ఆమనగల్ జెడ్పీ హెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కళ్లెం వెంకట్ రెడ్డి గుగులోత్ సత్యశంకర్ అన్నారు. మండలంలోని ఆమనగల్ జెడ్పీ హెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో గుండాల గడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గుండాల గడ్డ తండా, సుందర్ తండాడ, వెనుక తండాల్లో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సదానందం, రమేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: బడీడు పిల్లలను గుర్తించి పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ బి.పూల్‌చంద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆయన బడిబాట ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రు, ఉపాధ్యాయులు శివ, వీరభద్రం, రాము, స్వర్ణలత, సీఆర్‌పీ ఉపేందర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: కొల్లాపురంలో ఉపాధి పనుల వద్ద బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కురవి: బడిబాట ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎర్రగడ్డకాలనీకి చెందిన జల్లంపల్లి అశోక్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు సోమవారం భాధిత కుటుంబానికి, సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ క్వింటా బియ్యం అందజేశాడు. అదే విధంగా కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీశ్‌నాయక్ బాధిత కుటుంబానికి రూ.2వేల ఆర్థికసాయం అందజేశాడు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, వెంకన్న, మోడెం రాజు, శ్రీనివాస్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన ఒంటెల ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, సోమవారం మృతుడి పెద్దకుమార్తె చామంతి తన తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

సీమంతాలు

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగలితండా అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుకిణి, వార్డు సభ్యులు మంగమ్మ, భీక్యా, టీచర్ నీలాదేవి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: కొత్తగూడెంలో ఈనెల 11వ తేదీన నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టిబోయిన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, బిక్షమయ్య, పిచ్చయ్య, వీరన్న, రంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: డిసెంబర్ 2022లోపు కొత్తగా భూమి పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రానున్న వానాకాలం సీజన్‌లో రైతుబంధు పెట్టుబడి సహాయం పొందేందుకు ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం తెలిపారు. జిరాక్స్‌లు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, ఏఐఏడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం చలో కలెక్టరేట్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ కె.శశాంకకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకన్న, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

బొడ్రాయి విగ్రహాల శోభాయాత్ర

కురవి: మండల కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి, పోతురాజుల విగ్రహాల శోభాయాత్ర కనుల పండువగా వైభవంగా జరిగింది. కార్యక్రమంలో బొడ్రాయి దాత బుక్కా వీరన్నస్వాతి దంపతులు, గ్రామ పెద్దలు చిన్నం భాస్కర్, నూతక్కి నర్సింహారావు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



తొర్రూరు: ఒడిశా రైలు ప్రమాద మృతులకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ప్రజాపంథా ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. రైలు ప్రమాద మృతులకు సంతాపంగా ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీర న్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

గూడూరు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అండగా ఉంటుందని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తుందని మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. మండలంలోని లైన్‌తండాకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మూడు చంద్యానాయక్ (48) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. మండల అధ్యక్షుడు కత్తి స్వామి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి. యాకూపాష పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు బ్రహ్మంగారితండాకు చెందిన బాదావత్ బాలు(47)అనే వ్యక్తి తండాశివారులో గల వ్యవసాయ బావిలో ఆదివారం పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈమేరకు వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. కాగా తండాలో ఓ వ్యక్తి చనిపోగా అంత్యక్రియలకు వెళ్లి వస్తున్న నాభర్త బాలును, వ్యవసాయ బావివద్ద కొందరు వ్యక్తులు పాతకక్ష్యలను దృష్టిలో పెట్టుకుని బావిలో పడేయడం వల్లే చనిపోయాడని ఆరోపిస్తూ, మృతుడి భార్య బాదావత్ లక్ష్మీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

గార్ల: మామిడితోట అగ్నికి ఆహుతికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపారు. వివరాలు.. గార్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన రావిపాటి నాగమల్లేశ్వరి, ఆమె చెల్లెలుకు చెందిన మామిడితోటకు పక్క రైతు డబ్బా వెంకటేశ్వర్లు తన మొక్కజొన్న బెండ్లకు నిప్పు పెట్టగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మామిడితోటకు నిప్పు అంటుకొంది. సుమారు రూ.1,40,000 మామిడి కాయలతోపాటు, మామిడి చెట్లు కాలిపోయాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సంఘటనా స్థలాన్ని సందర్శించి రైతు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

కురవి : ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా సోమవారం గాయపడ్డారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కురవి శివారులోని పెద్ద చెరువు సమీపంలో 365 జాతీయ రహదారిపై కొత్తూరు(జీ) గ్రామానికి చెందిన మీర్జాఖలీల్ కురవి నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సైదులు బైక్‌లు పరస్పరం ఢీకొట్టుకున్నాయి. ఈఘటనలో మీర్జాఖలీల్‌కు తలకు తీవ్ర గాయమైంది. సైదులుకు కాళ్లు విరిగాయి. ఇద్దరిని కురవి పోలీసులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఖలీల్ పరిస్థితి బాగాలేకపోవడంతో వరంగల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివాము దగ్ధం

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామంలో ఆదివారం రాత్రి పచ్చిపాల మధుకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. 200 మోపుల గడ్డివాము దగ్ధమైందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌కి చెందిన వార్డుసభ్యుడు గుంజపాడుగు రాజశేఖర్‌పై ఇటీవల దాడికి పాల్పడిన కేసులో ధన్నసరి శివారు సొళ్లతండాకు చెందిన దారావత్ కిషోర్, దారావత్ రాజు, దారావత్ దేవులా, కేసముద్రంస్టేషన్ శివారు బ్రహ్మంగారితండాకు చెందిన బాదావత్ గణేష్, బాదావత్ తావుర్యాలను సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మహాసభకు తరలిన నాయకులు

గంగారం/కొత్తగూడ: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్)తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలు ఖమ్మం జిల్లాలో సోమవారం నిర్వహించారు. ఈసభలకు గంగారం, కొత్తగూడ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బూర్క వెంకటయ్య, రాజనర్సయ్య, జెజ్జరి సమ్మక్క, ఈసం జగ్గారావు, 'జిల్లా నాయకుడు శ్రీశైలం పాల్గొన్నారు.

'ఏం సాధించారని సంబురాలు'

నెల్లికుదురు: కేసీఆర్‌పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, ఏం సాధించి సంబురాలు చేసుకుంటున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న ప్రశ్నించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఇరుగు అనిల్, వెంకన్న, యాకన్న, మహేష్, మోహన్, వెంకట్ పాల్గొన్నారు.